

# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

సోమవారం 04 ఆగష్టు 2025 పేజీలు : 04




## కృషి, పట్టుదల, ఉంటే ఏదైనా సాధించవచ్చు

**పెనుకొండ ఆగస్టు 3 ప్రభాతవార్త**

కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ద్వారా ఏ విజయాన్నైన సాధించవచ్చని మంత్రి సవిత అన్నారు. ఆదివారం పట్టణంలో మంత్రి కార్యాలయంలోఇ టీవల విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపికైన వారిని అభినందించి, తదనంతరం సభలో మాట్లాడారు. దాదాపు లక్ష్యాన్ని నిర్దేశించుకొని, నిరంతరంగా శ్రమించి విజయాన్ని సాధించడం గొప్ప అభినందనీయమని మీ తల్లిదండ్రులకు కలలు నెరవేర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు ఉద్యోగాలు పొందిన కానిస్టేబుల్స్ వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

← కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన వారిని అభినందించిన మంత్రి సవిత

### సునీతమ్మ నీ భర్త ఎవరిని కలవరించుకుని

## భయపడే వాడో మీకు తెలుసుకదా..

- ఈ రాజకీయ జీవితం మద్దెల చెరువు సూరి పెట్టిన బిక్ష
- నీ తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తి లేదు
- తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హెచ్చరిక



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**అనంతపురం సిటీ, ఆగస్టు 3 ప్రభాతవార్త**

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ నీ భర్త ఎవరి పేరు చెబితే రాత్రిళ్లలో కూడా భయపడే వాడో ఏనాడైనా రాత్రి పూట నిద్ర పోయాడా అన్నది నీకే ఎక్కువ తెలుసుగా అంటూ రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. వైసిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పరిటాల రవి పేరు చెబితే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భయదుతాడని పరిటాలసునీ తచేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. 1998 నుంచి 99లో నీ భర్త ఏ రోజైనా రాత్రిపూట నిద్రపోయాడా, ఎవరిని కలవరించుకుంటూ భయపడేవాడో నీకు తెలుసునన్నారు. అరవింద్ నగర్‌లో మీ ఇంటి సమీపంలోనే మేము నివశించామని గుర్తుంచుకోవాలన్నారు. నీ రాజకీయ జీవితం మద్దెల చెరువు సూర్యనారాయణరెడ్డి పెట్టిన బిక్ష కాదా అని ఆయన ప్రశ్నించాడు. ఆర్‌ఓసి అనే ప్రైవేట్ క్రిమినల్ సంస్థను ఏర్పాటు చేసుకుని అనేక మందిని ఊచ కోత కోయించి ఆ సంస్థ ద్వారా దౌర్జన్యంగా డబ్బును వసూలు చేసి మీ కుటుంబం లబ్ది చేకూరింది వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. పరిటాల రవి కంటే నేడు పరిటాల సునీత అంటేనే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఎద్దేవా చేశారు. పరిటాల రవి శత్రువులతో ఫ్యాక్షన్ చేసి ఉండవచ్చునని, నీవు మాత్రం తడి గుడ్డ కూడా అవసరం లేకుండా గొంతులు కోస్తున్నావని ఆయన విమర్శించారు. పరిటాల సునీత అంటే మోసం గ్యారెంటీ అని మీ పార్టీ నేతలు, కులస్తులు, ప్రజలు చెప్పుకుంటున్నాం న్నారు. అధికారంలో ఉంటే జుట్టు, అధికారంలో లేకపోతే కాళ్లు పట్టుకునే నైజంతో రాజకీయాలు కొనసాగిస్తున్నావని విమర్శించారు. తాటాకు చప్పుళ్ల బెదిరింపులకు భయపడే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 20 ఇయర్స్ జైలు ప్లానింగ్ అంటే.. హత్యలు చేస్తావా

- అలాంటి ఆలోచనలు మానుకో ప్రకాష్ రెడ్డి.. జాగ్రత్తగా ఉండు - చరిత్రను వక్రీకరించి రెచ్చగొడుతున్నావ్.. పరిటాల సునీత ఆగ్రహం
- నీలాగా మీ అధినేతకు, మీ ఛానల్‌కు విలువలు విశ్వసనీయతలు లేవు - మహిళల్ని కించపరిచిన వారికి పరామర్శలా.. జగన్ పై సునీత మండిపాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు, ఆగస్టు 3 ప్రభాతవార్త**

20సంవత్సరాల పాటు జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానంటూ ప్రకాష్‌రెడ్డి బహిరంగంగా మాట్లాడుతున్నారంటే.. మళ్లీ హత్యలు చేసేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద ఆమె తీవ్రంగా స్పందించారు. తన క్యాంప్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..20ఏళ్ల జైలులో ఉండాలంటే హత్యలు చేసే వెళ్లాలి. అలాంటి ఆలోచనలు ఏమైనా ఉంటే మానుకొని జాగ్రత్తగా ఉండు ప్రకాష్ రెడ్డి అంటూ హెచ్చరించారు. మేము నీలాగా ఆలోచిస్తే నువ్వు ఇంత స్వేచ్ఛగా మాట్లాడగలుగుతావా అని ప్రశ్నించారు. గతంలో జరిగిన చరిత్రను వక్రీకరిస్తూ మీ పార్టీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొడుతున్నావంటూ మండిపడ్డారు.

పరిటాల రవి తన ప్రాంతానికి ఏం చేశారు.. ప్రజలకు ఎలాంటి పరిస్థితుల్లో అండగా నిలిచారన్నది ఎవర్నడిగినా చెబుతారన్నారు. నువ్వు చేసిన పాపాలు పండాయనిచ, జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మా ప్రభుత్వంలో అంతా చట్ట ప్రకారం ఉంటుంది కాబట్టే నీ జైలు బాటకు కాస్త సమయం పడుతోందన్నారు. మేము నీలా అధికారాన్ని అడ్డం పెట్టుకుని దౌర్జన్యాలు, దోపిడీలు చేయలేదన్నారు. నన్ను చూసి ప్రజలు, టీడీపీ నాయకులు భయపడటం లేదని తప్పు చేసి నీలాగా తప్పించుకుని తిరుగుతున్న వారే భయపడుతున్నారన్నారు. తప్పులు చేసి, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడే వారికి ఎప్పటికీ నేను నా కుమారుడు సింహస్వప్నమేనని ఇందులో ఎలాంటి మార్పు ఉండదన్నారు. అది మాకు పరిటాల రవి నుంచి వారసత్వంగా వచ్చిందన్నారు. మేము ఎవరినైనా బెదిరించి ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. రైతుల గురించి ప్రేమ ఒలకబోస్తున్న నువ్వు ఐదేళ్లలో ఎందుకు పేరూరు ప్రాజెక్టు విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని నిలదీశారు. రాక్రీట్ సంస్థ ద్వారా పేదలు, ప్రభుత్వ సొమ్ము దోపిడీ చేసి.. ఇప్పుడు తగుదనమ్మా అంటూ బయలుదేరావని విమర్శలు చేశారు. ఇప్పటికైనా హత్యా రాజకీయాలు, రెచ్చగొట్టే చర్యలు మానుకుని.. ప్రజలకు ఏం చేస్తున్నామన్న దానిపై మాట్లాడితే బాగుంటుందని సునీత హితవు పలికారు.

### మహిళల్ని కించపరిచిన వారికి పరామర్శలా :

మాట్లాడితే విలువలు విశ్వసనీయత అనే జగన్ రెడ్డి ఒక మహిళా ఎమ్మెల్యేను సభ్య సమాజం తలదించుకునేలా ఒక వ్యక్తి మాట్లాడితే.. అతన్ని పరామర్శించేందుకు నెల్లూరు జిల్లాకు వెళ్లారని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డిని ఎందుకు పరామర్శించేందుకు వెళ్లావో సూటిగా సమాధానం చెప్పగలవా అంటూ నిలదీశారు. పైగా అక్కడికి వెళ్లి నిస్సిగ్గుగా ప్రభుత్వంపై నిందలు వేసిన జగన్ రెడ్డి తీరు చూసిన మహిళలు అసహ్యించుకున్నారన్నారు. మహిళలను గౌరవించలేని వైసీపీ పార్టీని చూసి ప్రజలు చీదరించుకుంటున్నారని ఒక్క సారి ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ఆస్తి కోసం తల్లి, చెల్లి మీద వేసిన కేసులో విజయం సాధించిన వీరుడు లా కనీసం మానవత్వం లేకుండా ప్రచారం చేసుకుంటున్న నీకు విలువలు, విశ్వసనీయత ఉన్నాయా అని నిలదీశారు. సాక్షి పత్రికలో వస్తున్న వార్తలు చూస్తుంటే జనం అసహ్యించుకుంటున్నారని ఇది విలువలు గురించి మాట్లాడే భారతి రెడ్డికి తెలుసా అని ప్రశ్నించారు. బంగారుపాళ్యంలో రైతుల కష్టం మామిడి కాయలు దొంగలించి, తొక్కించిందే చాలక మద్దతు ధర లేక రైతులు పారబోశారంటూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. పరిశ్రమలకు భూములు కేటాయించినా, ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నా, మద్యం కుంభకోణంలో వైసీపీ నాయకులు అడ్డంగా నోట్ల కట్టలతో దొరికినా, అరాచకాలతో ఐదేళ్ల వైసీపీ నేతలు పేట్రేగిపోయినా ఒక్క రోజైనా మీ పత్రికలో వార్త వచ్చిందా అంటూ నిలదీశారు. అసలు జగన్ రెడ్డి మొదలుకొని ఆ పార్టీకి సంబంధించిన కరపత్రిక సాక్షి వరకు ఆ పార్టీలో వారికి ఎవరికీ విలువలు, విశ్వసనీయత లేవని సునీత అన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన తాగునీటి పైప్ లైన్ మరమ్మతులు

- మరమ్మత్తు పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే పరిటాల సునీత - గ్రామాలకు తాగునీటి సరఫరా పునఃప్రారంభం
- ప్రజలు, వాహనదారులు ఈ అసౌకర్యాన్ని అర్థం చేసుకోవాలని కోరిన ఎమ్మెల్యే సునీత





పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



**అనంతపురం రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్టేడియం వద్ద తాగునీటి పైప్ లైన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదే శాల మేరకు ఆర్.డబ్ల్యూ ఎస్, నేషనల్ హైవే, పోలీసు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది రెం డు రోజుల పాటు శ్రమించి ఈ పనులను పూర్తి చేశారు. అనంతపురం రూ రల్ పరిధిలోని చియ్యేడు, ఆకుతోటపల్లి, ఎస్కేయూనివర్శిటీ, ఇటుకలపల్లి, చిన్న కుంట, కృష్ణంరెడ్డిపల్లి గ్రామాలకు సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ ద్వారా నీరు సరఫరా అవుతోంది. అయితే ఆర్డీటీ స్టేడియం వద్ద ఈ తాగునీటి పైప్ లైన్ పగిలింది. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే పరిటాల సునీత అధికా రులను అప్రమత్తం చేశారు.

ముందుగా గ్రామస్థులకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని సమాచారం అందించారు. వెంటనే అధికార యంత్రాంగాన్ని మొత్తం రంగంలోకి దింపారు. పైప్ లైన్ పనులు భారీ యంత్రాలతో చేయాల్సి ఉండటం, అందునా బెంగళూరు, చెన్నై హైవేల మార్గం కావడంతో వాహనాల రాకపో కలకు అంతరాయం ఉంటుందని భావించారు. అందరికీ ముందస్తు సమాచా రం అందించి గత నెల 26న అధికారులు, స్థానిక ప్రజాప్రతి నిధులతో కలిసి వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలిం చారు. వారం రోజులలోపు ట్రాఫిక్ సమస్య లేకుండా మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. శనివారం సాయంత్రం 7గంటల నుంచి పనులు ప్రారంభిం చారు. అనంతపురం నగరం నుంచి పంగల్ రోడ్డు వైపు, పంగల్ రోడ్డు నుంచి అనంతపురం నగరం వైపు వాహనాలు రాకుండా ట్రాఫిక్ మళ్లిం చారు. వాహనాలన్నీ రాప్తాడు మీదుగా అనంతపురం వచ్చేలా చూశా రు. శనివారం సాయంత్రం 7గంటల నుంచి తెల్లవారుజామున 2గంటల లోపు ఒక దశ మరమ్మతులను పూర్తి చేశారు. అప్పటి నుంచి కృష్ణంరెడ్డి పల్లి, చియ్యేడుకు నీరు పంపింగ్ ప్రారంభించారు. ఆ తర్వాత మరమ్మతులను ఆపకుండా కొనసాగిస్తూ.. ఆదివారం మధ్యా హ్నం 2గంటలకు పూర్తి చేశారు. అప్పుడు ఆకుతోటపల్లి, చిన్నపల్లి, ఎస్కేయూని వర్శిటీకి, ఇటుకలపల్లికి నీరు పంపింగ్ ప్రారంభిం చారు. ఈ పనులను రెండు రోజుల పాటు ఎమ్మెల్యే పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం సాయంత్రం స్వయంగా అక్కడికి వెళ్లి పైప్ లైన్‌ను పరిశీలించారు. అన్ని గ్రామాలకు నీరు సక్రమంగా సరఫరా అవుతోందా లేదా అన్నది ఆరా తీశారు. భవిష్యత్‌లో పైప్ లైన్ భద్రత గురించి అధికారులను ఆరా తీశారు. మరోసారి ఇలాంటివి జరగకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడ ఇబ్బంది వచ్చే అవకాశం ఉందని తెలిసినా ముందస్తుగానే పనులు చేపట్టాల న్నారు. రెండు రోజుల పాటు ప్రజలకు, వాహనదారులకు కొంత వరకు అసౌకర్యం ఏర్పడిందని.. మరమ్మతు పనుల దృష్ట్యా వారు కూడా అర్థం చేసుకోవాలని కోరారు.



**కూరగాయల ధరల వివరాలు:**

| కూరగాయలు | కిలో ధర (రూపాయల్లో) |
| --- | --- |
| 1. పచ్చి మిర్చి | 100 |
| 2. టమోటా | 40 |
| 3. ఉల్లిగడ్డలు | 25 |
| 4. ఉర్లగడ్డలు | 60 |
| 5. క్యారెట్ | 50 |
| 6. ముల్లంగి | 40 |
| 7. బెండకాయలు | 60 |
| 8. క్యాబేజ్ | 50 |
| 9. బీట్రూట్ | 40 |
| 10. వంకాయలు | 50 |

## ఏం కొనేటట్ల లేదు..ఏం తినేటట్ల లేదు..!

- చుక్కలనంటుతున్న కూరగాయల ధరలు
- విలవిల్లాడిపోతున్న సామన్య, మధ్యతరగతి ప్రజలు
- మార్కెటింగ్ సౌకర్యంలేక తగ్గుతున్న కూరగాయల సాగు

**ఉరవకొండ, ఆగస్టు 3 ప్రభాతవార్త**

గత నెల రోజులుగా కూరగాయల ధరలు చుక్కలనంటుతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. వర్షాభావ పరిస్థితులు, వాతావరణంలో సంభవిస్తున్న పెనుమార్పులతో కూరగాయల ధరలు సైతం పెరిగిపోతున్నాయి. జిల్లాలో కూరగాయల సాగుకు సరైన ప్రోత్సాహంలేక తోటలు క్రమేనా అంతరించిపోతుండటంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో 500 రూపాయలు మార్కెట్టుకు తీసుకెళ్లినా ఐదారు రకాల కూరగాయాలు కేజీ వంతున కూడా రావడం లేదని గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని గృహిణులు వాపోతున్నారు. ఏ కూరగాయలు చూసినా కేజీ 50 నుండి 100 రూపాయలు ధర ఉంటోందని నాలుగైదు నెలల వరకు నిలకడగానే ఉన్న కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయని అంటున్నారు. తాము పండించిన పంటకు మార్కెటింగ్ చేసుకునే అవకాశంలేక బోర్లు, బావుల క్రింద కూరగాయల పంటలను సాగుచేస్తున్న రైతులు వాటికి బదులు వాణిజ్య పంటల సాగుపైనే ఆసక్తి కనబరుచడమే ధరల పెరుగుదలకు మరో కారణమని తెలుస్తోంది. కూరగాయల పంటలు సాగుచేసే రైతులకు సరైనా ప్రోత్సాహం, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో పచ్చి సరుకులను మార్కెట్టుకు తరలించి మధ్యవర్తులకు నష్టాలకే విక్రయించాల్సి వస్తోందని పలువురు రైతులు వాపోతున్నారు. దీన్ని బట్టి చూస్తే పంట పండించే రైతు, వాటిని కొనగోలు చేసుకునే వినియోగదారుడు నష్టపోతుండగా మధ్యవర్తులు మాత్రమే బాగుపడుతున్నారని స్పష్టమౌతోంది. ప్రభుత్వం కూరగాయాల రైతులకు మరింత ప్రోత్సాహం అందించి వారు పండించిన పంటలకు మారె ్కటింగ్ సౌకర్యం కల్పించి మార్కెట్లలో దళారులను నియంత్రించగలిగితే అటు రైతుతోపాటు ఇటు వినియోగదారుడికీ ఊరట లభించి ధరలు అదుపులోనే ఉంటాయన్నది సుస్పష్టం.

## సోషల్ వెల్ఫేర్‌లో ఇన్‌చార్జ్‌ల పాలన...!

- డీడీ, రెండు ఏఎస్‌డబ్ల్యూవో పోస్టులు ఖాళీ
- సమయపాలన పాటించని జిల్లా కార్యాలయంలోని పలువురు ఉద్యోగులు
- తెలిసినా పట్టించుకోని రాష్ట్ర ఉన్నతాధికారులు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 3 ప్రభాతవార్త**

సోషల్ వెల్ఫేర్‌లో ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతుంది. డీడీ తో పాటు రెండు ఏఎస్‌డబ్ల్యూవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా కార్యాలయంతో పాటు రెండు డివిజన్లలోని హాస్టల్స్ పర్యవేక్షణ కూడా కొరవడింది. ఈ విషయం ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం గమనార్హం.

అనంతపురం జిల్లా సోషల్ వెల్ఫేర్ రెగ్యులర్ డీడీగా పనిచేస్తున్న ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి కేవలం మూడు నెలల్లో నెల్లూరు జిల్లా పోర్టు ఈడీగా డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. దీంతో గుత్తి ఏఎస్‌డబ్ల్యూవోగా పనిచేస్తున్న రాధికకు డీడీ (ఎఫ్ఏసీ)గా ఈ ఎడాది ఫిబ్రవరి 17న బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆ అధికారిణికి మే 20న డీఎస్‌డబ్ల్యూవోగా పదోన్నతి కల్పిస్తూ అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో జూన్ 2న రిలీవ్ కావడంతో అప్పుడు డీటీడబ్ల్యూవోగా పనిచేస్తున్న రామాంజినేయులకు డీడీ (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్ను ప్రభుత్వం మాతృశాఖకు సరెండర్ చేసింది. దీంతో ఆయన జూలై 21న రిలీవ్ కావడంతో బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొరారికి ఇన్‌చార్జ్ డీడీగా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. రెగ్యులర్ డీడీని వెంటనే నియమించాలని కూడా జిల్లా కలెక్టర్ డైరెక్టర్‌కు లెటర్ పంపించడం జరిగింది.





### కొరవడిన పర్యవేక్షణ

గత కొన్ని నెలలుగా రెగ్యులర్ డీడీ లేకపోవడం వలన జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులపై పర్యవేక్షణ కొరవడింది. ఉద్యోగులు ప్రతి రోజు ఉదయం10:30 గంటలకు కార్యాలయానికి రావాల్సి వుంది. కాని కొందరు ఉద్యోగులు ఆలస్యంగా వస్తున్నారు. అంతే కాకుండా మధ్యాహ్న భోజనానికి 30-45 నిముషాలు మాత్రమే అనుమతి వుంది. కానీ మధ్యాహ్నం ఒంటి గంటకు వెళ్లే పలువురు ఉద్యోగులు మధ్యాహ్నం 3 గంటల తర్వాత వచ్చి 5 గంటలు అయిన వెంటనే వెళ్లిపోతున్నారు. అంతే కాకుండా ఉద్యోగులు పనివేళలల్లో భయటకు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో కారణం రాయాలని నిబంధన వుంది. కానీ అక్కడ మూమెంట్ రిజిస్టర్ ఉన్నప్పటికీ అందులో ఒక్కరు తప్ప మిగిలిన ఏ ఉద్యోగి భయటకు వెళ్లినప్పుడు రిజిస్టర్‌లో కారణం రాయకపోవడం గమనార్హం. ఆ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు ఏ సమయానికి వస్తారు, తర్వాత ఏ సమయానికి భోజనానికి వెళ్లి తిరిగి ఎన్ని గంటలకు వస్తారు, సాయంత్రం ఇంటికి ఎన్ని గంటలకు వెళ్తారన్నది కార్యాలయంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తే వాస్తవాలు భయటపడుతాయి. అంతే కాకుండా గుత్తి, ఉరవకొండ ఏఎస్‌డబ్ల్యూవో పోస్టులు గత కొన్ని నెలలుగా ఖాళీగా ఉండటంతో పక్క ఏఎస్‌డబ్ల్యూవోలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా తాడిపత్రి ఏఎస్‌డబ్ల్యూవో శ్రీనివాసులు పేరుకు మాత్రమే అక్కడ ఒక రూం అద్దెకు తీసుకున్నారు. కానీ స్థానికంగా నివాసం ఉండకుండా ప్రతి రోజు సొంత ఊరు (పక్కజిల్లా)కు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఆయన రెండు రోజులు జరిగిన వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సిలింగ్ ఒక్క రోజు కూడా హాజరుకాలేదు. దీంతో ఆ మూడు డివిజన్లలోని హాస్టల్స్ పర్యవేక్షణ కూడా కొరవడింది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే రెగ్యులర్ డీడీ లేకపోవడం వలన పాలన సవ్యంగా సాగడం కష్టంగా మారింది రెగ్యులర్ డీడీ ఉంటే తన శాఖను అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లడానికి అవకాశం వుంది. కానీ ప్రస్తుత ఇన్‌ఛార్జ్ డీడీ కూడా తన సొంత శాఖ బీసీ వెల్ఫేర్ డీడీ బాధ్యతలు కూడా నిర్వర్తించాల్సి వుంది. అలా రెండు శాఖల డీడీ బాధ్యతలు నిర్వర్తించడం వలన పనిఒత్తిడి కూడా పెరిగే అవకాశం వుంది. కావున రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ డీడీతో పాటు ఖాళీగా ఉన్న రెండు ఏఎస్‌డబ్ల్యూవో పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. అయితే దీనిపై ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారన్నది వేచి చూడాల్సిందే.

## నిబద్ధ విమర్శకుడు డాక్టర్ కల్లూరి ఆనందరావు సాహిత్యంలో..

.. జాతి పట్ల, సమాజం పట్ల, ఆయన దృక్పథం ఏమిటో కనిపిస్తుంది

- ఆలోకనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ రచయితలు



అనంతపురంలో ఆలోకనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ రచయితలు

**అనంతపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త బ్యూరో**

కల్లూరి ఆనందరావు గారి సాహిత్యంలో జాతి పట్ల, సమాజం పట్ల, ఆయన దృక్పథం ఏమిటో కనిపిస్తుంది. సామాజిక పరిణామాల నేపథ్యంలో గొప్ప విమర్శకుడిగా ఆనందరావు తనదైన ముద్ర సాహితీ లోకంలో ఏర్పరచు కున్నారు అని వక్తలు కొనియాడారు. విమలా శాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి మరియు కళా జోత్స్న సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన డాక్టర్ కల్లూరి ఆనంద్ రావు రచించిన "ఆలోకనమ్" పుస్తకా విష్కరణ కార్యక్రమం స్థానిక ఎన్జీవో హోం లో డాక్టర్ శాంతి నారాయణ అధ్యక్షతన ఆదివారం ఉదయం 11 గంటలకు ఘనంగా జరిగింది. పుస్తకావిష్కరణ కర్తగాను, ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రముఖ విమర్శకుడు ,ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి మాటా ్లడుతూ, విమర్శకు రాయలసీమ ప్రధాన భూమిక పోషించిందని, సమాజం సాహిత్యం సాహిత్య విమర్శ ఇవి విమర్శకు త్రయాలు అని అన్నారు. డాక్టర్ కల్లూరి ఆనందరావు గారి ఆలోకనమ్ విమర్శ గ్రంథంలో దళిత బహుజన సాహిత్య విమర్శ చాలా లోతుగా కనిపిస్తుందని కొనియాడారు. సిపి బ్రౌన్ వేమన సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావడమే కాకుండా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని కొనియాడారు. విమర్శకుడు అహంకారిగా ఉండకూడదు అంటూ వర్ధమాన విమర్శకులకు సూచన చేశారు. నాగరికత కలిగిన వ్యక్తి డాక్టర్ కల్లూరి ఆనందరావు అని కొనియాడారు. పుస్తకావిష్కరణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ కథా నవలా రచయిత డాక్టర్ శాంతి నారాయణ ప్రసంగిస్తూ, విమర్శలో తనదైన దృక్పథంతో ప్రయా ణిస్తు న్న గొప్ప విమర్శకుడు కల్లూరి ఆనందరావు. దళిత జీవితం ప్రధానంగా ఆలోకనమ్ విమర్శ గ్రంథంలో కనిపిస్తుందన్నారు. ఆలోకనమ్ పుస్తకాన్ని సమీక్ష చేసిన ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారామ్ ప్రసంగిస్తూ, ఆలోకనమ్ సాహిత్య విమర్శ గ్రంథంలో నిబద్ధత అనిబద్ధత విమర్శ రెండూ కనిపిస్తాయని, 24 వ్యాసాలలో కూడా సుకుమా రత కనిపిస్తుందని విప్పారిన పుష్పాలుగా వ్యాసాలు మనల్ని ఆకట్టు కుంటాయన్నారు. పొడిబారిన వాక్యాల్లో తడి ఉండాలి అని కోరుకునే గొప్ప విమర్శకుడు డాక్టర్ కల్లూరి ఆనంద్ రావు అని కొనియాడారు. పుస్తక రచయిత ,విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కల్లూరి ఆనందరావు ప్రసంగిస్తూ, మహాకవి గుర్రం జాషువా, బో యి భీమన్న, ఆచార్య కొలకలూరి ఇనాక్

మిగతా 4లో...

02ATP03_02ATP03.qxd 03-08-2025 PM 11:22 Page 1



## సంక్షేమ సామ్రాట్ గా జగన్ మోసపూరిత వాగ్దానంతో చంద్రబాబు పరిపాలన

-వైకాపా జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్





మాట్లాడుతున్న మాజీ మంత్రి దృశ్యం

**అమరాపురం ఆగస్టు 3 ప్రభాతవార్త**

మండల పరిధిలోని హాలుకూరు పరిధిలో ఆదివారం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సత్యసాయి జిల్లా వైకాపా పార్టీ అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పాల్గొన్నారు. రాష్ట్ర బీసీ విభాగపు వైకాపా ఉపాధ్యక్షుడు హాలుకూరు కాంతరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికిరాష్ట్ర వైకాపా ఆర్గనైజేషన్ యాక్టివిటీ కార్యదర్శి,పిఏసి సభ్యులువజ్ర భాస్కర్ రెడ్డి,మడకశిర నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త ఎస్ ఎల్ ఈరలక్కప్ప, రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి, రొల్ల జడ్పిటిసి అనంతరాజు,జిల్లాయువజన విభాగం అధ్యక్షులు అమరాపురం మండల ఇన్చార్జ్ గంగుల సుధీర్ రెడ్డి, మండల కన్వీనర్లు త్రిలోక్నాథ్ , నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాలుకూరు గ్రామం నందు ఏర్పాటుచేసిన బాబు షూరిటీ మోసం గ్యారంటీ సమావేశం ఉద్దేశించి మాజీ మంత్రి ఉషశ్రీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో చంద్రబాబు కుటుంబం ప్రభుత్వం చేస్తున్న మోసాలను బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె కార్యకర్తలకు సూచించారు. గత వైకాపా ప్రభుత్వంలో 53 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద డబ్బులు పంపిణీ చేస్తే, నేడు కూటమి ప్రభుత్వం 46 లక్షల మందికి అన్నదాత సుఖీభవ కింద నిధులు విడుదల చేసి అన్నదాతలకు దాదాపు ఆరు లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ లో మొండి చేయి చూపారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసులు అధికార పార్టీ కి వత్తాసు పలుకుతూ ప్రతిపక్ష పార్టీ నాయకులను కేసులతో వేధిస్తున్నారని ఇది ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఈ సందర్భంగా వజ్ర భాస్కర్ రెడ్డి, సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర వైకాపా బీసీ విభాగపు ఉపాధ్యక్షుడు హాలుకూరు కాంతరాజు తదితరులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి గతంలో ప్రజల కోసం పని చేశారని, రాబోవు రోజుల్లో పార్టీ నాయకులు కార్యకర్తల కోసం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామస్థాయిలో కూడా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి గట్టి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉండాలని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలోని మడకశిర నియోజకవర్గం మోడల్ నియోజకవర్గంగా ఎంపిక చేసుకొని గ్రామ స్థాయి నుండి కమిటీలను ఏర్పాటు చేసి బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమంలో ద్వారా ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బార్కోడు కలిగిన బాబు షూటింగ్ మోసం గ్యారెంటీ ప్లాకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్థానిక వైకాపా నాయకులు ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, మాజీ ఒక్కలిగా కార్పొరేషన్ డైరెక్టర్ వీరకేతరాయప్ప, ఎంపిటీసీ నారాయణ గౌడ్, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ రామ్మూర్తి, నాగరాజు, ఆటో తిప్పయ్య, ఎంపిటిసి మైలారప్ప, మాజీ ఎంపిటిసి నాగేంద్రప్ప, మాజీ డీలర్ దివాకర్, గొంచి కారు హనుమంతరాయప్ప, కాచికుంట రమేష్ పాల్గొన్నారు.

## వైకాపానేత హరి మృతి పార్టీకి తీరని లోటు

- లేపాక్షి మండల వైకాపా కన్వీనర్ నిస్సార్అహ్మద్



నివాళులు అర్పిస్తున్న వైసిపి కన్వీనర్, నాయకులు

**లేపాక్షి, ఆగస్టు 3 ప్రభాతవార్త**

మండలంలోని సిరివరం గ్రామానికి చెందిన వైకాపా నేత హరి మృతి పార్టీకి తీరని లోటని లేపాక్షి మండల వైకాపా కన్వీనర్ నిస్సార్అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం రేషం పొలంలో మల్బరీ ఆకు కోస్తుండగా వున్నఫలంగా హరి కింద పడిపోవడం జరిగిందని స్థానికులు తెలిపారు. అక్కడి నుండి హరిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే కన్వీనర్ నిస్సార్ అహ్మద్ వైకాపా నాయకులతో కలిసి సిరివరం గ్రామానికి వెళ్లి హరి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు కన్వీనర్ 5 వేల రూపాయలను అందచేశారు. అనంతరం మృతుని భార్యను ఓదారుస్తూ అధైర్యపడవద్దని మీ కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా వుంటుందని భరోసా కల్పించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. నివాళులు అర్పించిన వారిలో సిరివరం సర్పంచు నేత్రావతి, కో ఆప్షన్ సభ్యులు బషీర్, నాయకులు ప్రభాకర్గౌడ్, మల్లన్న, చంద్రశేఖర్రెడ్డి, రామాంజి, తిప్పన్న, నాగరాజు, చందు, ఫరూక్, ముబారక్, రవికుమార్, అల్లాబకాష్, అబ్రార్, గంగాధరప్ప, తదితర వైకాపా నాయకులు వున్నారు.

## యువకుడి దారుణహత్య



హత్యకు గురైన దాదాపీర్

**లేపాక్షి, ఆగస్టు 3 ప్రభాతవార్త**

లేపాక్షి మండల పరిధిలోని తిలక్నగర్ స్మశానం సమీపంలో దాదాపీర్ అనే యువకున్ని గుర్తుతెలియని మరో యువకుడు దారుణంగా కత్తితో పొడిచి హత్య చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. దాదాపీర్ హిందూపురం పట్టణ పరిధిలోని గుడ్డం ప్రాంతానికి చెందినవాడు. దాదాపీర్తో పాటు మరో యువకుడు కలసి వచ్చినట్లు ఆ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు. అయితే వారిద్దరి మధ్యన గొడవ జరిగి దాదాపీర్ను కత్తితో పొడిచి పరారైనట్లు తెలుస్తోంది. పోలీసుల విచారణలో హత్యకు గల కారణాలు తెలియాల్సి వుంది.

## ఉచిత గుండె వైద్య శిబిరం



ఉచిత గుండె వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

**ధర్మవరం రూరల్ ఆగస్టు 3 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో ఉచిత గుండె వైద్య శిబిరమును నిర్వహించడం జరిగిందని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సొసైటీ సామాజిక విభాగం సలహాదారులు డాక్టర్ సత్య నిర్ధారన్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు గుండె పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరిగిందని మొత్తం గ్రామములో 20 మందికి హిమోగ్లోబిన్ రక్తపరీక్ష, రక్తపోటు పరీక్ష, నిర్వహించామని తెలిపారు. ఈ శిబిరం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షులు అండ్ వ్యవస్థాపకులు డాక్టర్ సోమలరాజు శివరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిబిరా నిర్వాహకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ గుండుమల



సన్మానం దృశ్యం

**అమరాపురం ఆగస్టు 3 ప్రభాతవార్త**

అమరాపురం మండలం గొల్ల మారనపల్లి గ్రామానికి చెందిన రామచంద్రప్ప సోదరుడు వార్డ్ మెంబర్ శశి కుమార్ వివాహ వేడుకల్లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కర్ణాటక రాష్ట్రం దొడ్డ బాణగెరె లో వివాహ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తో పాటు తెలుగు దేశం పార్టీ మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, సీనియర్ నాయకులు కుమార్ స్వామి, హేమావతి పంచాయితీ టిడిపి కన్వీనర్ తిప్పజ్జ ,మండల క్లస్టర్ కన్వీనర్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ ఓంకార్ స్వామి, ఆలయ కమిటీ ఛైర్మన్ కరేగౌడ్, దయానంద్, సురేష్ ,ఫీల్డ్ అసిస్టెంట్ గౌడ రంగప్ప తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన ప్రముఖులకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## పిఆర్సీ కమీషనర్ ను వెంటనే నియమించాలి

ప్రభుత్వాకి ఏపీటీఎఫ్ డిమాండ్




ఏపీటిఎఫ్ నాయకుల దృశ్యం

**అమరాపురం ఆగస్టు 3 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని అమరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మండల శాఖ సబ్ కమిటీ సమావేశం ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు ఎన్. హనుమంతరాయప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్, ఎన్నికల అధికారిగా యంజేరప్ప,పరిశీలకులుగా లతా రామకృష్ణ హాజరై నూతన సబ్ కమిటీని ఎన్నుకోవడమైనది .రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న డి ఏ లను వెంటనే చెల్లించాలని,నూతన పిఆర్సి 2023 జూలై ఒకటవ తేదీ నుండి అమలులోకి రావలసి ఉన్నప్పటికీ ఇప్పటికి రెండు సంవత్సరాలు ముగిసినప్పటికీ పిఆర్సి కమిషనర్ నియమించకుండా నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగ లోకానికి తీవ్ర నిరాశకు గురి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి పిఆర్సి కమిషనర్ ను నియమించి మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బదిలీలు మరియు ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయుల పొజిషన్ ఐడి ల సమస్యను పరిష్కరించి వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు .ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్. నారాయణప్ప, సి. తిప్పేస్వామి, గంగప్ప, గోవిందప్ప,లింగన్న, అశోక్, రఘువీర్, కృష్ణమూర్తి, కే ఎన్. నరసింహమూర్తి, బాబావలి, ముఖ లింగం,తదితరులు పాల్గొన్నారు.

## ఫెన్సింగ్ గేమ్ లో మెరిసిన షేక్ ముఫైజ్



షేక్ ముఫైజ్కు పథకాలు అందజేస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, అగస్ట్ 03 ప్రభాతవార్త**



పతకాలతో షేక్ ముఫైజ్

అనంతపురం రూరల్ రుద్రంపేట గ్రామపంచాయతీ కి చెందిన రోషన్ జమీర్, హాలిమ కుమారుడు షేక్ ముఫై జ్ ఫెన్సింగ్ గేమ్ లో తన సత్తా చాటుతూ జాతీయస్థాయిలో మూడు పథకాలు, రాష్ట్ర స్థాయిలో 15 పథకాలు సాధించడం జరిగింది. జాతీయా స్థాయి మూడు పథకాలు, జమ్మూ కాశ్మీర్ ( జమ్మూ ) యస్ జీ ఫ్ అండర్ 19 ఛత్తీస్ ఘర్ (రాయ్పూర్) అండర్ 19అస్సాం (గువహతి) సీనియర్ రాష్ట్ర స్థాయి లో 15పథకాలు. ఒంగోలు సిల్వర్ అండర్17 శ్రీకాకుళం ఇండివిడ్యుయల్ గోల్డ్ యు 23శ్రీకాకుళం బ్రోంజ్ అండర్ 17కర్నూలు జట్టు గోల్డ్అండర్19కర్నూల్ జట్టు బ్రోంజ్ అండర్ 19కాకినాడ సీనియర్స్ సిల్వర్ నంద్యాల గోల్డ్ 19భీమవరంగోల్డ్అండర్ 20నంద్యాల ఇండివిజువల్గోల్డ్ అండర్19 నంద్యాల (యస్, జీ, ఫ్, గోల్డ్ అండర్ 19అనంతపురం ఉత్తమ విద్యార్థి అవార్డు బంగారు పతకం అనంతపురం వ్యక్తి గోల్డ్ డి.ఎస్.ఎ అనంతపురం గోల్డ్ డిఎస్ ఎ అనంతపురం బ్రోంజ్ నందాయల్ సిల్వర్ యస్ జీ ఫ్ అండర్ 19 రాష్ట్రస్థాయిలో మొత్తం 15 పథకాలు సాధించారు.

## ఉప్పరపల్లి లో మీ సమస్య మా బాధ్యత



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, అగస్ట్ 03 ప్రభాతవార్త**

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి పంచాయతీలో టీడీపీ నాయకులు ఉప్పరపల్లి క్లస్టర్ గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ తో కలసి ప్రజల సమస్య పరిష్కారంలో భాగంగా మీ సమస్య మా బాధ్యత అనే కార్యక్రమంలో నిర్వహించి అక్కడ నివసించే ప్రజల నుంచి సమస్య లకు సంబందించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాయకులకు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పరపల్లి తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ రామలక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ శ్రీ శ్రీనివాస రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ రాగే మురళి,తలారి జగదీష్, కాయల గోవిందు,బుక్ చెర్ల కుల్లాయప్ప,తలారి రాజశేఖర్,తలారి శివశంకర్ రాజు, బుక్కచర్ల రాము, జుటురూ బాలరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్ సచివాలయం సిబ్బంది కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లు బిగించరాదు విద్యుత్ ఛార్జీలు పెంచరాదు

- సిపిఎం, సిపిఐ పార్టీ నాయకుల డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

**ధర్మవరం రూరల్ ఆగస్టు 3 ప్రభాతవార్త**

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించరాదని విద్యుత్ చార్జీలు పెంచరాదని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ధర్మవరం సిపిఐ సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో వైయస్సార్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించి రైతులకు ప్రజలకు మోయ లేని భారాన్ని వేసి బాదుడే బాదుడని నినాదాలతో రైతులకు ప్రజలకు మా అధికారం రాగానే బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించి భారాన్ని తగ్గిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నారా లోకేష్ పిలుపునివ్వడం జరిగినదని కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం గడిచినప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీను మరిచి ఇప్పటివరకు పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించకుండా రైతులకు ,ప్రజలకు మోయలేని భారం వేస్తోందని ,ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని, బిగించిన స్మార్ట్ మీటర్లు తొలగించాలని వామపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాని పక్షంలో రాష్ట్ర కమిటీల పిలుపుమేరకు మంగళవారం పట్టణంలోని విద్యుత్ ఆఫీసు వద్ద స్మార్ట్ మీటర్లు బిగించరాదని ప్రజలను,ప్రజా సంఘాలను కలుపుకొని ప్రభుత్వం పై పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకొని వస్తామని ప్రభుత్వానికి వారు హెచ్చరించడం జరిగినది. ఈ నెల 5 జరగబోయే ధర్నా కార్యక్రమానికి రైతులు ప్రజలు వ్యాపారస్తులు కలసి రావాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ భాష, పట్టణ కార్యదర్శి మారుతి, జెవి. రమణ, ఆయుబ్ ఖాన్, రవి, పాల్గొన్నారు.

## అరుణాచల గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

**ధర్మవరం రూరల్ జూలై 3 ప్రభాతవార్త**



డిపో మేనేజర్ సత్యనారాయణ

అరుణాచల గిరిప్రదక్షిణకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును భక్తాదులకు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర్ణమి సందర్భంగా ధర్మవరం ఆర్టీసీ డిపో నుండి ఈ నెల 8వ తేదీ ఉదయం 6 గంటలకు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనార్థం సాయంత్రం అరుణాచలం చేరుకొని గిరిప్రదక్షిణ ముగించుకుని 9 తారీకున తిరుగు ప్రయాణం ఉంటుందని ఆయన తెలిపారు. ఒక మనిషికి రాను పోను చార్జీలు 1400 రూపాయలు మాత్రమేనని దర్శనానికి వెళ్లవలసిన భక్తాదులు ఆన్లైన్లో గాని, బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్లో గాని, సీట్లను రిజర్వేషన్ చేసుకునే అవకాశం కలదనితెలిపారు. "భగవంతుని సేవలో భక్తులు!! భక్తుల సేవలో ఏపీఎస్ఆర్టీసీ ఎల్లప్పుడు ముందంజలో" ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఈ క్రింది సెల్ నెంబర్ 9959225859 సంప్రదించాలని తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన



వైద్య శిభిరం నిర్వహిస్తున్న దృశ్యం

**చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త**

చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలోని సిఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఆదివారం స్పందన ఆస్పత్రి ఆధ్వర్యంలో రెండు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో ఊపిరితిత్తులు, అలాగే చాతి నొప్పి, జబ్బుల వైద్య శిబిరంలో డాక్టర్ పూర్ణచంద్ర (పల్మనాలజిస్ట్ ), రోగులకు పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా చిన్నపిల్లల వైద్య శిబిరంలో డాక్టర్ మహమ్మద్ గౌస్, డాక్టర్ రితిక్క్ రవీంద్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకము ద్వారా అర్హులైన చిన్న పిల్లలకు స్పందన ఆసుపత్రిలో అడ్మిషన్ చేసుకొని ఉచితంగా చూడడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ఈ రెండు ఉచిత వైద్య శిబిరా లలో దాదాపు 234 మందికి పరీక్షించడం జరిగిందన్నారు. ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసినందుకు గాను ప్రజలు, స్పందన హాస్పిటల్, డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియాకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ బాబా ఫక్రుద్దీన్, సిబ్బంది దిల్దార్, నర్సులు పాల్గొన్నారు.

## గుత్తి ఆర్ఎస్లో చోరీ



చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**గుత్తి, ఆగస్టు 3 ప్రభాతవార్త**

గుత్తి ఆర్ఎస్లోని పత్తికొండ సర్కిల్ సమీపంలోని భవాని వైన్స్ షాప్లో ఆదివారం అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగింది. దొంగలు షాపు వెనుక భాగం కన్నం వేసి లోనికి చొరబడి లాకర్లో వున్న 30 వేల రూపాయల నగదు, విలువైన మద్యం బాటిళ్లు అపహరించారు. ఈ చోరీ దృశ్యాలన్నీ సిసి పుటేజ్లో రికార్డయ్యాయి. వైన్ షాప్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు సిసి ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## చంద్రన్న సుఖీభవ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**అగళి, ఆగస్టు 3 ప్రభాతవార్త**

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు 5వ తేది ఉదయం 10 గంటలకు అగళి మండల రైతులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు మడకశిరలో జరుగు చంద్రన్న సుఖీభవ కార్యక్రమానికి తరలి రావాలని జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ తిప్పేస్వామి కోరారు. మండలంలోని సీనియర్ నాయకులు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు, క్లస్టర్ ఇన్చార్జ్లు, డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజా ప్రతినిధులు, తెల్లచొక్కా, తెల్లపంచ, ఆకుపచ్చ రుమాలు ధరించి ఈ కార్యక్రమానికి రావాలని కోరారు.

## కొత్తచెరువుకు చెందిన సంతోష్ కు మంత్రి నారా లోకేష్ నుంచి అందిన ప్రత్యేకపెళ్లి కానుక



మంత్రి నారా లోకేష్ పంపిన ప్రత్యేక పెళ్లి కానుక గిఫ్ట్ ను అందజేస్తున్న ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు లక్ష్మీనారాయణ తదితరులు దృశ్యం

**కొత్త చెరువు ఆగస్టు 3 ప్రభాతవార్త.**

కొత్తచెరువు కు చెందిన టిడిపి సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి చిన్నపోళ్ళ లక్ష్మీనారాయణ కుమారుడు సంతోష్ వివాహం సందర్భంగా రాష్ట్ర ఐటీ విద్య శాఖ మంత్రి నారా లోకేష్ బాబు నుంచి ప్రత్యేక గిఫ్ట్ ను పెళ్లి కానుకగా అందించారు. టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ చిన్నపోళ్ల లక్ష్మీనారాయణ కుమారుడు సంతోష్ వధువు ప్రియ కృష్ణ వివాహం ఈనెల 2న హైదరాబాదులో అత్యంత వైభవంగా సాగింది. ఈ వివాహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి సతీమణి నారా భువనేశ్వరి మంత్రి నారా లోకేష్ గారి సతీమణి నారా బ్రాహ్మిణి తోపాటు సినీ హీరో నారా రోహిత్ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా హాజరయ్యారు. మంత్రి నారా లోకేష్ బాబు సింగపూర్ పర్యటన వల్ల చిన్న పోళ్ల సంతోష్ వివాహానికి రాలేకపోయారు. నారా కుటుంబానికి చిన్న కోళ్ల సంతోష్ కుటుంబానికి చాలా కాలం క్రితం నుంచి సుపరిచితులు గా ఉన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సూచన మేరకు పుట్టపర్తి మామిళ్ళకుంట క్రాస్ లో ఎస్ జి కన్వర్షన్ హాల్లో ఆదివారం నూతన వరుడు సంతోష్ వధువు ప్రియ కృష్ణ లకు నిర్వహించిన ప్రత్యేక రిసెప్షన్ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ బాబు ప్రత్యేకంగా పంపించిన పెళ్లి కానుకను స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ముద్దుపాటి లక్ష్మీనారాయణ చేతులమీదుగా ఈ పెళ్లి కానుకను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సినీ హీరో నారా రోహిత్, మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు ,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జయ ప్రకాష్ , అంబులెన్స్ రమేష్ ,కొత్తచెరువు టిడిపి కన్వీనర్ వలిపి శ్రీనివాసులు , రాజు, ఎమ్మెల్యే పీ ఆర్వో సంతోష్ రెడ్డి,టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



25 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమావేశంలో కలిసిన విద్యార్థులు,ఉపాధ్యాయులు

**వజ్రకరూర్ ఆగస్టు 3 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000 2001 కు చెందిన పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా వారికి చదువు నేర్పించిన ఉపాధ్యాయులను పూలమాలతో సన్మానించి శాలువా కప్పి, మెమొంటోలను అందజేశారు. విద్యార్థులు ఒక్కొక్కరుగా వారి అనుభవాలను వివరిస్తూ 25 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ గత స్మృతులను మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వినోద కార్యక్రమాలలోనే కాకుండా కష్టసుఖాలలో కూడా పాలు పంచుకునేలా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు.

## బీజేపీ కనుసన్నల్లో డబుల్ ఇంజన్ సర్కార్ పనిచేస్తోంది..!

- 9,10న జరిగే పట్టణ మహాసభలను విజయవంతం చేయండి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

**గుంతకల్లు, ఆగస్టు 3 ప్రభాతవార్త**

రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ సర్కార్ బీజేపీ, ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పనిచేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ విధానాలను రాష్ట్రంలో అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీకి మెజార్టీ వున్నప్పటికీ రాష్ట్ర హక్కులను సాధించుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. విద్యార్థి సంఘాలపై ఆంక్షలు విధించడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్ మీటర్ల విషయంలో కూటమి ప్రభుత్వం ద్వంద వైఖరి సరికాదన్నారు. పోలవరం ప్రాజెక్టు 41 అడుగులకు తగ్గిస్తూ రాయలసీమకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఎన్నికల ముందు వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఎలాగైనా గెలవాలని బిజెపి అధికార దుర్వినియోగానికి ఎన్నికల సంఘాన్ని కూడా ప్రభావితం చేసిందన్నారు. రాజకీయ ప్రజాదోపిడిని ఎండగట్టడానికి సిపిఐ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు.

**పట్టణ మహాసభలను విజయవంతం చేయండి :**

ఈనెల 9,10న తలపెట్టిన సిపిఐ పట్టణ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి మూడేళ్లకోసారి గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు మహాసభలను జరుపుకొని పార్టీ కార్యక్రమాలను సమీక్షించుకోవడం జరుగుతుందన్నారు. 9న పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు వేలాదిమంది కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం పాత బస్టాండ్లో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాము రాయల్, నాయకులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన గిరీష్

**గుడిబండ ఆగస్టు3 ప్రభాతవార్త**



గిరీష్

మండల పరిధిలోని మోపురుగుడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు లక్ష్మమ్మ,పాత లింగప్ప కుమారుడు గిరీష్ ఇటీవల విడుదలైన ఏపీపీఎస్సీ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తల్లిదండ్రులతో పాటు ఉపాధి పనులకు వెళుతూ,వ్యవసాయ పనులను చేసుకుంటూ ఒక సాధారణ కుటుంబ పోషణలో పెరిగిన గిరీష్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎన్నిక కావడంతో స్నేహితులు, గ్రామస్తులు,బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

# పేపకాట స్థావరంపై దాడులు రూ.72,230 నగు, 8 మంది అరెస్టు

## - బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించేవారినని అదుపులోకి తీసుకున్న పోలీసులు - డిఎస్పీ శివనారాయణ స్వామి



పేకాట ఆడుతున్న జూదరులను అరెస్టు చేస్తున్న పోలీసులు



బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారి ని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కదిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త

కదిరి రూరల్ ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడులు జరిపి రూ.72,230 నగదు, 8 మందిని అరెస్టు చేసినట్లు కదిరి డిఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు..ఆయన తెలిపిన వివరాల మేరకు ఆదివారం కదిరి రూర ల్ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో పేకాట స్థావరంపై తమ సిబ్బంది దాడులు జరిపి నగదు, 8 మం ది అరెస్టు, 8 ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు డిఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. అలాగే కదిరి సబ్ డివిజన్‌లో అసాంఘీక కార్యకలా పా లు, మత్తు పదార్థాలు సేవించే, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారి పై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచి చర్యలు తీసుకున్నామన్నారు. అందులో భాగంగా కదిరి మున్సిపల్ పరిధిలోని పుటా గుల, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో డ్రోన్ సాయంతో నిఘ్రూ ఉంచి బహి రంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై దాడులు జరిపి అదుపులోకి తీసుకున్న ట్లు డిఎస్పీ తెలిపారాఉ. కదిరి సబ్ డివిజన్‌లో అసాంఘీక కార్యక లాపాలు గంగజాయి, జూదం, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వంటి వాటికి పాల్పడితే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని డిఎస్పీ హెచ్చరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారం...కమ్యూనిస్టులతోనే సాధ్యం

## - ఎర్రజెండాలతో ఎరుపెక్కిన తాడిపత్రి - ఎన్నికల హామీలు అమలులో కూటమి ప్రభుత్వం విఫలం - సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్

తాడిపత్రిటౌన్, ఆగస్టు 3 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారం కమ్యూనిస్టులతోనే సాధ్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని రజక ఫంక్షన్ హాల్‌లో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య ఆధ్వర్యంలో 16వ నియోజకవర్గ మహాసభలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిపిఐ సీనియర్ నాయకులు పెద్దవడుగూరు సూర్యనారాయణరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, సిపిఐ తాడిపత్రి నియోజకవర్గ సహాయ కార్యదర్శి వెంకటరాముడుయాదవ్ పాల్గొన్నారు. ముందుగా పోలీస్‌స్టేషన్ సర్కిల్ నుండి రజక ఫంక్షన్ హాల్ వరకు ఎర్రజెండాలు చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ, దేశంలో ప్రతి సంస్థలను కార్పోరేట్లకు అప్పజెప్పి కార్పోరేట్లకు కొమ్ము కాస్తోందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోనికి రాక మునుపు విద్యుత్ చార్జీలు జగన్ ప్రభుత్వం పెంచుతూ పోతోందని, తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచం, స్మార్ట్ మీటర్లు బిగించమని ఆనాడు చెప్పాడని తీరా అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం వేస్తున్నారన్నారు. అలాగే జగన్ ప్రభుత్వం పేదలకు ఒక సెంటు స్థలం ఇచ్చాడని ఆ స్థలం పేదలకు సరిపోదని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణంలో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామని ప్రతిపక్షం లో వున్నప్పుడు చెప్పాడని కానీ చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి సంవత్స రమైనా నిరుపేదల కు ఇంటి స్థలాలు ఇవ్వలేదని విమర్శిం చారు. అంతేకా కుండా ఎన్నికల్లో చంద్రబాబునాయుడు దాదాపు 76 హామీలు ప్రజలకు ఇచ్చాడని ఇప్పుడు ఏదో నాలుగు సంక్షేమ పథకాల అమలు చేశాడని, కానీ ఎన్నికల హామీలు అమలు చేయడం లో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఏది ఏమైనప్పటికీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు ప్రజల పక్షాన వుండి పోరాటం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, సిపిఐ పెద్దపప్పూరు మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, సిపిఐ మండల కార్యదర్శి నాగరంగయ్య, సిపిఐ యాడికి కార్యదర్శి మహమ్మద్‌రఫీ, రైతు సంఘం నాయకులు విటి రామాంజనేయులు, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం



: భోజనం వడ్డిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, ఆగస్టు 3 ప్రభాతవార్త

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం దిమ్మగుడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రికి వచ్చిన వందలాది మంది రోగులకు ఈ భోజన వసతి కల్పించినట్లు ఆయన తెలిపారు.

# బాధితునికి రూ.10 వేలు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందచేస్తున్న వందేమాతరం టీం సభ్యులు

తనకల్లు, ఆగస్టు 3 ప్రభాతవార్త

పక్షవాతంతో బాధపడుతున్న రహంతుల్లా అనే వ్యక్తికి వందేమాతరం టీం సభ్యులు 10 వేల రూపాయల ఆర్థికసాయం అందచేశారు. తనకల్లు మండలం నల్లగుట్లపల్లికి చెందిన రహంతుల్లాకు పక్షవాతం రావడంతో అతని ఆరోగ్య ఖర్చుల నిమిత్తం వందేమాతరం టీమ్ సభ్యులు 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు. వందేమాతరం టీం ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేస్తున్నారని ప్రజలు ప్రశంసిస్తూ టీం సభ్యులకు వారు ధన్యవాదాలు తెలియచేశారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుస్తకాలు, నగదు పంపిణీ

యాడికి, ఆగస్టు 3 ప్రభాతవార్త

స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రాయలచెరువు గ్రామంలోని న్యూ వికాస్ పాఠశాలలో ఆదివారం న్యూ వికాస్ పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ స్నేహితులు ఏపీఎస్‌ఆర్టీసి ఉద్యోగి రాజశేఖర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాజకుమార్‌లు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుస్తకాలు, నగదు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు న్యూ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వారు ఉచిత విద్యను అందిస్తున్నారని తెలుసుకున్న రాజశేఖర్, రాజ్‌కుమార్‌ల సహాయంతో పుస్తకాలు యూనిఫాం కొరకు ఒక్కొక్క విద్యార్థికి 5 వేల రూపాయల చొప్పున ఎనిమిది మంది విద్యార్థులకు అందించారు. రాజశేఖర్ మాట్లాడుతూ తమ మిత్రుడు రాజ్‌కుమార్ తల్లిదండ్రులు లేని విద్యార్థులు ఎవరైనా వుంటే వారికి పుస్తకాలు, యూనిఫామ్ కొరకు నేను చేయూత నందిస్తానని, ఎక్కడైనా వుంటే చూడమని చెప్పడంతో ఇలా తల్లిదండ్రులు లేని పిల్లలు న్యూ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ఉచిత విద్యను అభ్యసిస్తున్నారని తెలుసుకొని ఈ మొత్తాన్ని రాజ్‌కుమార్, రాజశేఖర్ రామకృష్ణ చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. అనంతరం లయన్‌క్లబ్ అధ్యక్షులు లక్ష్మినా రాయణశెట్టి మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని విద్యార్థు లకు ఎలాంటి ఫీజు లేకుండా ఉచిత విద్యను అందిస్తున్న కరస్పాండెంట్ రామకృష్ణను అభినందించారు. ప్రతిభ కనబరిచిన తల్లిదండ్రులు లేని విద్యార్థు లకు భవిష్యత్తులో మరింత ఆర్థిక చేయూతను అందిస్తా మని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, రామ్మోహన్‌రెడ్డి, చల్లా సూర్యనారాయణ, విద్యార్థులు వారి సంరక్షకులు, ప్రిన్సిపాల్ రజిత, ఇన్‌చార్జ్ అనిత పాల్గొన్నారు.




తల్లిదండ్రులు లేని విద్యార్థులకు నగదు అందచేస్తున్న ఆర్టీసి ఉద్యోగి రాజశేఖర్

# వాహనాల తనిఖీ




వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ

తాడిపత్రిటౌన్, ఆగస్టు 3 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని అనంతపురం బైపాస్‌రోడ్డు, తాడిపత్రి రూరల్ ప్రాంతంలో సిఐ శివగంగాధర్‌రెడ్డి ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించాలన్నారు. అతివేగంగా వాహనం నడపరాదన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో ఆర్‌సి, లైసెన్స్ కలిగి వుండాలని ఆయన వాహనదారులకు సూచించారు.

# వర్షాలు కురవాలని వరుణదేవుడు, కాటమయ్యకు ప్రత్యేక పూజలు



వరుణ దేవున్ని ప్రార్థిస్తున్న గ్రామ ప్రజలు

యాడికి, ఆగస్టు 3 ప్రభాతవార్త

వర్షాలు కురవాలని మండలంలోని దైవాలమడుగు గ్రామస్తులు ఆదివారం వరుణదేవుడు, కాటమయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి పొలాలు పచ్చని పైర్లతో కళకళలాడాలని పంటలు బాగా పండాలని గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా కాటమయ్యకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి ప్రజలు త్రాగడానికి నీరు లేక ఎంతటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తెలిపేలా పులగం అన్నం, కారంతో భోజనాలు చేసి వరుణ దేవుణ్ణి ప్రార్థించారు. వర్షాలు కురవకపోతే ఆనవాయితీలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వరుణ దేవుని కృపాకటాక్షాలు తమపై వుండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

# భక్తులతో సందడిగా మారిన అశ్వత్థం

పెద్దపప్పూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త

మండలంలోని చిన్నపప్పూరు సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన అశ్వత్థక్షేత్రం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. శ్రావణమాసం కావడంతో పెద్దఎత్తున భక్తులు అశ్వత్థంకు తరలి వచ్చి శ్రీఅశ్వత్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలిం గేశ్వరస్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఉద యం శ్రీఅశ్వత్థనారాయణస్వామికి అర్చకులు పంచామృ తాభిషేకాలు నిర్వహించి, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. అలాగే శ్రీచక్రభీమలింగేశ్వ రునికి అర్చకులు బాలసుబ్రవ ణ్యశర్మ పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



శ్రీఅశ్వత్థనారాయణస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు



శ్రీచక్రభీమ లింగేశ్వర స్వామిని అలంకరించిన దృశ్యం

# అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

అమడగూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త

మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ సచివాలయం పరిధిలో ధర్మవరానికి చెందిన గుణశెట్టి రాజేష్ అనే యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుని తమ్ముడు బాలచందర్ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.



మృతి చెందిన గుణశెట్టి రాజేష్ (ఫైల్‌ఫోటో)

# సుపరిపాలనలో తొలి అడుగులో వచ్చిన సమస్యలు పరిష్కారం

యాడికి, ఆగస్టు 3 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని లాలెప్ప కాలనీలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వచ్చిన సమస్యలను టిడిపి నాయకులు పరిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకుల దృష్టికి లాలెప్ప కాలనీకి చెందిన కొద్దిమంది స్పీడ్ బ్రేకర్ల సమస్య వుందని ఎదురెదురు సందులో ఉన్న పిల్లలు వచ్చినప్పుడు వాహనాల నుండి సమస్యలు ఎదురవుతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని కావునా కాలనీలో మూడు చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరగా, తక్షణమే స్పందించిన జె.సి అభిమాని విశ్వం ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు మూడు చోట్ల స్పీడ్ బ్రేకర్లను వేయించడం జరిగింది. దీంతో కాలనీవాసులు శ్రీధర్, కిషోర్, గురు, విజయ్, నాగేంద్ర, కుండా లక్ష్మినారాయణ, మధు, శివలు హర్షం వ్యక్తం చేస్తూ ఎన్నో సార్లు అధికారు లకు అర్జీలు ఇచ్చినా సమస్య తీరలేదని సమస్యను చెప్పిన వారంలోపే తీర్చిన జె.సి అభిమానులకు, టిడిపి నాయకులకు వారు కృతజ్ఞతలు తెలియచేశారు. అలాగే ఆ కాలనీలో వున్న కాలువను శుభ్రం చేసి, చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వెలిగండ్ల ఆదినారాయణ, బిసి సెల్ మండల కన్వీనర్ తిరంపురం నీలకంఠ, రామచంద్ర, సుభాన్, గుండా నారాయణస్వామి, వెంకటస్వామి, గన్నే రమేష్, పోలా రామాంజినేయులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మాయకుంట్ల నారాయణ స్వామి, పూల తోట రవి, రహమతుల్లా, చాంద్‌బాషా, తిరుమలేష్, శివ, చందు, కరీం, మేకల రామాంజి, రమణ, లల్లూ, గిల్లి, పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న దృశ్యం

# ఘనంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలు

పుట్లూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలను ఆదివారం పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకులు గోవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తాడిపత్రి మండలం ఆవులతిప్పాయపల్లి గ్రామంలోని శ్రీరమణ మహర్షి అనాథాశ్రమంలోని 130 విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా చిన్నారిచేత కేక్‌నకట్ చేయించి అందరికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారిచేత కేక్ కట్ చేయిస్తున్న దృశ్యం

# యల్లనూరులో ఘనంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

యల్లనూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలను మండల కన్వీనర్ దొడ్లో రామాంజినేయులు, టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియచేస్తూ వారి సమస్యలను పరిష్కరించి ప్రజా పరిపాలన అందిస్తున్న ఎమ్మెల్యే మరిన్ని ఉన్నత పదవులు పొందాలని వారు ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌నాయుడు, టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి, సదాశివారెడ్డి, సర్పంచు కుళ్లాయప్పనాయుడు, దొడ్లో హనుమయ్య, దొడ్లో పవన్, దివాకర్, శంకర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అలంకరణలో శ్రీకాళికాదేవి

తాడిపత్రిటౌన్, ఆగస్టు 3 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని వడ్లపాలెంలో వెలసిన శ్రీకాళికాదేవి అమ్మవారు ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం రెండవ ఆదివారం పురస్కరించుకుని ఉదయం అర్చకులు వీరబ్రహ్మం ఆచార్యులు అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పుష్పాలంకరణ, మహా మంగళహారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీకాళికాదేవి అమ్మవారిని అలంకరించిన దృశ్యం




# రాష్ట్ర నాయకత్వం దృష్టికి ఎరుకలు ఎదుర్కొంటున్న సమస్యలు

## -ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్

ఉరవకొండ, ఆగస్టు 3 ప్రభాతవార్త

ఎరుకల ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్ ఆదివారం తెలిపారు. సంఘం ఉరవకొండ నియోజకవర్గ నాయకులతో కలిసి విజయవాడ, గుంటూరులో ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాస చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి పాలపర్తి శ్రీనివాసరావు, క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు మేడా గోపిను మర్యాదపూర్వకంగా కలిసి అనేక సమస్యలను వారికి వివరించడం జరిగిందన్నారు. త్వరలోనే ఉరవకొండలో ఎరుకల ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరుగుతుందని కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించామన్నారు. కాగా విజయవాడ, గుంటూరుకు విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్‌ను రాష్ట్ర నాయకత్వం శాలు వాకప్పి సత్కరించిన సంఘం అభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియా డుతూ అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉరవకొండ నియోజ కవర్గ కార్యదర్శి సాకే మహేంద్ర, మండల అధ్యక్షులు వై.రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి వై.నాగంరాజుతోపాటు గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కోలేగుండ్ల శేఖర్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు పాలపర్తి శ్రీనివాస చక్రవర్తి, క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు మేడా గోపి తదితరులు

# ఉరవకొండలో వైభవంగా నాగుల పురదయ్య స్వామి మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం

## వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన కురుబలు

ఉరవకొండ, ఆగస్టు 3 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలో ఆదివారం నాగుల పురదయ్య స్వామి మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. కురుబల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీరప్ప స్వామి దేవుళ్ళను పట్టణ వీధుల గుండా మేళతాళాలు, డప్పు వాయి ద్యాల నడుమ ఊరేగించారు. దారి పొడవునా భక్తులు బీరప్ప దేవుళ్ళను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఊరేగింపులో గురువయ్యల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు రాజహంస శ్రీనివాస్, ఆకుకూర నాగరాజు, టిడిపి సీనియర్ నాయకులు ప్యారం కేశవానంద, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నాగుల పురదయ్య స్వామి మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

# స్నేహితుల దినోత్సవం సందర్భంగా 199091 టెన్త్ బ్యాచ్ సామాజిక సేవ

ఉరవకొండ, ఆగస్టు 3 ప్రభాతవార్త ఉరవకొండ పట్టణంలోని విఠల్ రుక్మిణి విజయ వృద్ధ అనాథాశ్రమంలోని వృద్ధ అనాథలకు199091 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. స్నేహితుల దినోత్సవంను పురస్కరించుకొని ఆదివారం రాత్రి వృద్ధ అనాథాశ్రమాన్ని సందర్శించి వారితో పాటు వివిధ ప్రాంతాల్లో తలదాచుకుంటున్న నిరాశ్రయులకు ఆహార పొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవం రోజు సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వి.రమేష్ బాబు నూర్ మహమ్మద్, ముద్దలాపురం రఘు, షేక్షావలి, సురేష్, బి.ఆర్.హరి, లక్ష్మన్న, గోపి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్లో తల్లిదండ్రుల సమావేశం

నార్పల, ఆగస్టు 3, ప్రభాతవార్త మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం తల్లిదండ్రు ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి, తాడి పత్రి డివిజన్ బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి రంగమ్మ ము ఖ్య అతిథులుగా హాజంయ్యారు. ఈ సందర్భంగా వార్డెన్ శాంత కుమారి డీడీ కి మొక్కను అంద జేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, పథకాలను సద్విని యోగం చేసు కొని బాగా చదువు కొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని విద్యార్థులకు సూచి ంచారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థులు కూడా పరీక్షలకు ఇప్పటినుండే ప్రణాళికబద్ధంగా సన్నద్ధం కావాలని, ప్రతి ఒక్కరు మంచి మార్కులతో పాస్ కావాలని సూచించారు. నేను 23 సంవత్సరాలకే ఆఫీసర్ అయ్యానని, మీరు కూడా ఇప్పుడు కష్టపడి చదివితే భవిష్యత్తులో మంచి జీవితం పొందవ చ్చు నన్నారు. ఆ విధంగా ప్రతి ఒక్కరు లక్ష్యం పెట్టుకొని ఆ లక్ష్యం కోసం బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం డీడీ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం హాస్టల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. వార్డెన్ శాంత కుమారి తో పాటు వర్కర్లు, విద్యార్థులు కలిసి హాస్టల్ పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

## సెలవుపై వెళ్లిన డీఈవో

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 3 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు తన భార్యకు ఆరోగ్యం బాగలేకపోవడంతో సోమవారం నుండి రెండు రోజులు సెలవుపై వెళ్లారు. తిరిగి బుధవారం విధులకు హాజరవుతారు. అప్పటి వరకు ఇన్‌చార్జ్ డీఈవోగా బెళుగుప్ప ఎంఈవో-1గా పనిచేస్తూ గుత్తి డీవైఈవో (ఎఫ్ఏసీ)గా పనిచేస్తున్న మల్లారెడ్డి కొనసాగనున్నారు.

## ప్రజలు మెచ్చిన నాయకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

### - తెలుగుదేశం యువ నాయకుడు వంకమద్ది రవీంద్ర

నంబుల పూలకుంట ఆగస్టు 2 ప్రభాతవార్త

ప్రజల మెచ్చిన నాయకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడు అని తెలుగుదేశం యువ నాయకుడు వంకమద్ది రవీంద్ర పేర్కొన్నారు. ఆయన ఆదివారం ఒక సమావేశంలో మాట్లాడుతూ..మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి చేయడం లో కీలక పాత్ర పోషిస్తున్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది ఏమీ లేదన్నారు. మన ముఖ్యమంత్రి ప్రజానేత లోటు బడ్జెట్ తో ప్రారంభమై రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో నడుపుతున్నాం న్నారు. ఏడాది పాలనలో ఏ నాయకుడు చేయలేని విధంగా సూపర్ సిక్స్ పథకాలలో ఒక్కొక్కటి అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదే అన్నారు.

## రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి పౌరుడు తెలుసుకోవాలి



తాహాశీల్దార్ దేవేంద్ర నాయక్

నంబులపూలకుంట, ఆగస్టు 3 ప్రభాతవార్త

రాజ్యాంగం కల్పించిన అతి గొప్ప వరం పౌర హక్కులు వాటి గురించి ప్రతి పౌరుడు తెలుసు కోవాలి అని తాహాశీల్దార్ దేవేంద్ర నాయక్ తెలిపారు. ఒ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .న్యాయం ధర్మం స్వేచ్ఛ అవకాశాలు అభ్యున్నత అనేది కేవలం కొంతమందికి కొన్ని వర్గాల వారికి వర్తించకుండా సమాజంలో ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించి పౌర హక్కులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన వారు అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రతి సోమవారం ఎమ్మార్వో కార్యాలయం వద్ద గ్రీవెన్స్ జరుగుతుంది వారి యొక్క సమస్యలు ఏమైనా ఉంటే అర్జీ రూపంలో అడిగి తెలుసుకోవాలని ప్రతి అర్జీదారులు వారి సమస్యలకు పరిష్కారం తెలపడం జరుగుతుందన్నారు. అలాగే మండల కేంద్ర పరిధిలో ఉమ్మడి భూములు ఆక్రమానికి గురైతే మాకు తెలియజేయాలని అలాగే ప్రతి ఒక్కరు రెవెన్యూ సేవలు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలు అవ్వండి

### లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**పామిడి ఆగష్టు 3 ప్రభాతవార్త**

రక్తదానం చేయడం ద్వారా మరొకరికి పునర్జన్మనం ప్రసా దించడం జరుగుతుందని అందువల్ల రక్తదానం చేయండి ప్రాణదాతలు అవ్వండని ప్రభు త్వ



రక్తదానం చేస్తున్న యువకులు

ఆయుష్ సీనియర్ వైద్యాధికారి, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, అధ్యక్షులు రఘువీర్‌రావు పిలుపునిచ్చారు. మేజర్ పంచాయితీ పరిధిలోని పి.కొండాపురం నందు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం మహా పుణ్యకార్య మన్నారు.ప్రతి ఒక్కరూ సమాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు .రక్తదానం చేసినటువంటి ప్రతి ఒక్కరికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. రక్తదాన శిబిరంలో దాదాపు 22 మంది రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ అలంబన జనార్ధన్, జీవన్,లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు,షేక్షావలి, గంగశేఖర్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

**శింగనమల, ఆగస్టు 3 ప్రభాతవార్త**

శింగనమల ఎమ్మెల్యే బండా రు శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలు ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఘన ంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సింగిల్ విండో అధ్యక్షులు గుర్రం లక్ష్మినారాయణ, రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసుల్ చంద్రమోహన్, పసుపుల శ్రీరామిరెడ్డి, బిసి బాబు, కాయల రమణ, తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయపరమైన ఆలోచనే సైన్స్ - జెవివి రాష్ట్ర అధ్యక్షులు డా.ఎం.గేయానంద్



మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర అధ్యక్షులు డా.ఎం.గేయానంద్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 3 ప్రభాతవార్త

మనం ఆలోచించే శాస్త్రీయపరమైనటువంటి ఆలోచనే సైన్స్ అని, ప్రశ్నించడం రుజువులు అడగడం సైన్స్ తత్వమని జెవివి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ డా.ఎం.గేయానంద్ అన్నారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక 18వ నగర మహాసభ న్యూటన్ జూనియర్ కాలేజ్‌లోని మీటింగ్ హాల్‌లో జరిగింది. నగర గౌరవాధ్యక్షులు ఎస్.గాంగే నాయక్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సైన్స్ ఎప్పుడు మనం ఆలోచించే విధానంలో మార్పు తీసుకొస్తుందని రుజువులు లేకుండా ఇతరులు చెప్పేదాన్ని నమ్మవద్దని తప్పనిసరిగా ప్రశ్నిస్తుందని అన్నారు. సమాజంలోని అశాస్త్రీయ ప్రచారాన్ని నమ్మదని అలాంటి వాటితో విభేదిస్తుందని అన్నారు.జనవిజ్ఞాన వేదికలో పనిచేయడం అంటే మన ఆలోచనలో సరైన మార్పుడావడమే అలాంటి మార్పు రాగలిగిన వాళ్ళు మాత్రమే పని చేయగలరని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. సైన్సు తెలియడం వేరు ఆచరించడం వేరని ఆచరించినప్పుడే దాని ఫలితం కనిపిస్తుందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎ. చంద్రశేఖర్ తెలియజే శారు.

నగర మహాసభలో " సమకాలిన పరిస్థితుల్లో సైన్స్ ఎదుర్కొంటున్న సవాళ్లు" అనే అంశంపై ఆయన మాట్లాడుతూ.. గొప్ప గొప్ప శాస్త్రవేత్తలు అందరు కూడా మానవాళి అభివృద్ధికై ఎన్నో రకాలైన ప్రయోగాలు చేస్తున్నారని అయినప్పటికీ వారి కృషికి తగ్గ ఫలితం గానీ సహకారం ఉండడం లేదని అన్నారు. ప్రపం చంలో ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా సైన్స్‌ను సరైన పద్ధతిలో ఉపయోగిం చడం తప్ప మరో మార్గం లేదని సైన్స్ నిర్లక్ష్యం చేసినటువంటి దేశాలు అభివృద్ధి చెందవని ప్రస్తుతం మన దేశంలో అలాంటి పరిస్థితి కనిపిస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. సైన్స్ ఉప యోగించు కుని చిన్న చిన్న దేశాలు ఎంతో అభి వృద్ధి చెందాయని వాటితో మనం పోటీ పడలేక పోవడం మన కున్న ఆలో చన విధా నంలో మార్పు రాక పోవడమేనని ఈ సందర్భం గా ఆయన తెలియ జేశారు. సైన్స్ ఒక అడుగు ముం దుకేస్తే దాన్ని వ్యతిరేకించే వాళ్ళు మాత్రం నాలుగు అడుగులు ముందుకు చేస్తారని దాన్ని తట్టుకొని నిలబడగలగాలంటే చాలా పటిష్టంగా పనిచేయ వలసి ఉంటుందని జెవివి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని ఆచరించి అన్వయించు కున్నప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుందని అటువంటి ప్రయత్నం జరగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా కార్యదర్శి కెంచా లక్ష్మినారాయణ, జిల్లా కోశాధికారి మహమ్మ ద్ జిలాన్, జిల్లా నాయకులు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, లింగమయ్య నాయకులు రమణయ్య, సమత జిల్లా కన్వీనర్ డాక్టర్ పి.ప్రసూన, సమత నాయకులు నాగరత్నమ్మ, శశికళ, లలిత లక్ష్మి, జెవివి నాయకులు రామిరెడ్డి, వీరరాజు, ప్రసాద్ రెడ్డి, తిరుపాలు, అర్జున్ నాయక్, గోపాల్ నాయక్, ప్రసాద్, లక్ష్మినారాయణ, రాఘవేంద్ర, బాబ్జాన్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు చట్ట సభలలో 44 రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమం

### - బహుజన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో నాయకులు పిలుపు




బహుజన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఐక్యతను చాటుతున్న దృశ్యం

అనంతపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త బ్యూరో

రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్), రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఆర్ఈఎఫ్) ఆధ్వర్యంలో ఆగస్టు 3వ తేదీన బహుజన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమం జయప్రదం అయినది. కార్యక్రమంలో భాగంగా ఆర్‌పిఎస్, ఆర్ఇఎఫ్ వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు ఆధ్వర్యంలో అనంతపురం పట్టణములో లలిత కళాపరిషత్‌లో ఆర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ నారాయణ నాయక్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. వివిధ పార్టీల్లో బిసిల రిజర్వేషన్లపైన జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాలలో వాటా కోసం మీరు కృషి చేయాలని, పార్లమెంట్‌లో బిసిలకు 44 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్ర క్యాబినెట్‌లో తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి బీసీవై పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్, వి.వరప్రసాద్ మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ పులివెందుల పోతుల సురేష్, ఎమ్మెల్సీ, నాటక అకాడమీ మాజీ చైర్మన్ చామలూరు హరిత, 93 బిసి కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బాబు, అక్బర్ బాషా మైనార్టీ సెల్‌కి పిసిసి కర్ణాటక, ప్రశాంత్ సింహ కర్ణాటక యూత్ కాంగ్రెస్ పి.వెంకటేశ్వర్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కళాకారులు వరంగల్ శ్రీనివాస్, ఆర్‌పిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు చింతల మోహన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఇఎఫ్ జాతీయ కన్వీనర్ జి.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు టి.రాజారమేష్, ఆర్‌పి ఎస్ జాతీయ సమన్వయకర్త శేషు, పని విశ్వవిద్యాలయాల రాష్ట్ర కన్వీనర్ సి.చింతన్న జాతీయ ప్రధాన కార్యదర్శి చిరుతల విటల్ గౌడ్ ఎక్కలూరు పుల్లయ్య బాలరాజు, రవిశంకర్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వివేక్ యాదవ్ నాగ మధు యాదవ్ ఎస్ఎస్‌టి అధ్యక్షులు కటిక జయరాం, ఏబిఎస్‌పి బికేస్ ఆనంద్, శ్రీరాములు, వాల్మీకి నారాయణస్వామి, ఎన్ఎస్‌యుఐ శ్రీనివాస్ యాదవ్, బీసీ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతా చంద్రమో హన్, చింతా నాగరాజు, సమాజ్ వాద్ పార్టీ బాబా ఫక్రుద్దీన్, ఆర్ఇఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్లు, టి.హరి కిషోర్‌వర్మ, జి.శ్రీనివాసులు, ఎం.ఓబులేసు పామన్న యాదవ్, బి.నారాయణప్ప, మావిటి శ్రీరాములు, ఉమాశంకర్, శంకర్ గౌడ్, డాక్టర్ సుంకన్న, రమేష్, పెరుగు శివకృష్ణ, చంద్ర చర్లహరి, కడప జిల్లా కన్వీనర్ దేరంగుల ప్రశాంత్, వరప్రసాద్, ఆర్ఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రాఘవేంద్రరావు, అదనపు ప్రధాన కార్యదర్శి ఆర్.మహేష్ నాయక్, బిసి సంక్షేమ సంగం జిల్లా అధ్యక్షులు చక్రధర్ యాదవ్, ఆర్‌పిఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎన్డీఏ ప్రభుత్వం,విద్యార్థుల సమస్యలు అనగదొక్కేందుకు కొత్త జీవో - ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి



జీవోను దగ్ధం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 3 ప్రభాతవార్త

విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వులను అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హనుమంతురాయుడు, కుల్లాయిస్వామి తీవ్రంగా ఖండించారు. అనంతపురం నగరంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉత్తర్వులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా హనుమంతరాయుడు కుల్లాయి స్వామి మాట్లాడుతూ..విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యారంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఈ పద్ధతిలో విద్యార్థి సంఘాలపై నిషేధం విధించడం ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్య అని ఆరోపించారు. ఈ నిర్ణయం ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ప్రతిబింబిస్తోందని, ఇది విద్యార్థుల అభివృద్ధికి పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవో ఎవరి కోసం ఎవరి బాగో కోసం తీసుకువచ్చారు తెలపాలని డి మాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచిం చుకొని ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్ష ంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ జీవో రద్దు చేసే వరకు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్, నగర కోశాధికారి నాని, సహాయ కార్యదర్శి సమీర్ నాయకులు తరుణ్, కార్తీక్ యశ్వంత్, అక్బర్, సురేష్ యశ్వంత్, ఉమేష్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని పోస్టు కార్డు ఉద్యమం

### భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామకృష్ణ



పోస్ట్ కార్డును విడుదల చేస్తున్న భవన కార్మిక సంఘ నాయకులు

**అనంతపురం ఆగస్టు 3 ప్రభాతవార్త**

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం కోసం జిల్లా వ్యాప్తంగా కార్మికుల ద్వారా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు పోస్టు కార్డుల ద్వారా సమస్యను తీసుకెళ్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు రాసిన పోస్టుకార్డులను భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులతో కలసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వి.రామకృష్ణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జివో నెం. 1214 ప్రవేశపెట్టి సంక్షేమ బోర్డులో ఉన్న రూ.1200 కోట్లు ప్రభుత్వం అవసరాలకు మళ్లించి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. 2024 ఎన్నికల ముందు కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్దరించి..పెండిరగ్‌లో ఉన్న క్లైములను పరిష్కరిస్తామని నిధులు మంజూరు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి కార్మి కులతో ఓట్లు వేయిం చుకుని అధికారంలోకి వచ్చిం దన్నారు. ఇప్పటికి కూటమి పాలన 13 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీని మేరకు సంక్షేమ బోర్డును పునరుద్దరించకుండా విస్మరిం చిందని, వెంటనే హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మన్న, ఉపాధ్యక్షులు వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఘనంగా సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలు




డాన్స్ కాంపిటీషన్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న చిరంజీవి అభిమాన సంఘ నాయకులు

**అనంతపురం ఆగస్టు 3 ప్రభాతవార్త**

రాష్ట్ర చిరంజీవి యువత ఆధ్వర్యంలో మెగా అభిమానులు డాక్టర్ పద్మభూషణ్,మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం అనంతపురం జిల్లా నుండి డాన్స్ కాంపిటీషన్ ను నిర్వహించారు. స్థానిక అశోక్ నగర్ లో ఉన్న భూపాలం ఫంక్షన్ హాల్లో ఈ వేడుక కనుల విందుగా నిర్వహించారు.రాష్ట్ర చిరంజీవి యువత అధ్యక్షుడు భవాని రవికుమార్ ఆధ్వర్యంలో రవణం స్వామి నాయుడు ఆదేశాల మేరకు ఈ డాన్స్ కాంపిటీషన్ నిర్వహించినట్లు అభిమాన సంఘ నాయకులు తెలిపారు. ఇందులో ప్రథమ బహుమతిగా గుత్తి ఆర్ ఆర్ టీం గెలుచుకోవడం జరిగింది ఇందుకు జడ్జిలుగా కత్తి విజయ్ కుమార్,గణేష్ డాన్స్ అకాడమీ మాస్టర్. చాంద్ భాషా వారి పర్యవేక్షణలో జరిగింది రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు అంగడి చలపతి, రామ్ చరణ్ జిల్లా అధ్యక్షుడు ఇమామ్ హుస్సేన్, మాజీ అధ్యక్షుడు షామీర్ పునీత్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు

## నిబద్ధ విమర్శకుడు డాక్టర్ కల్లూరి ఆనందరావు సాహిత్యంలో..

**మొదటిపేజీ తరువాయి...**

నాకు సాహిత్య గురువులని వారి రచనలు ఎంతో ప్రేరణ నిచ్చాయని ప్రసంగించారు.

రోటరీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ 3160 రొటీరియన్ పి కేశవరెడ్డి, అనంతపురం సెంట్రల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు,గల్లా హర్ష, డాక్టర్ పామిరెడ్డి దామోదర్ రెడ్డి డాక్టర్ నందిరాజు కళ్యాణి, డాక్టర్ జింక లక్ష్మీ నారాయణ, కల్లూరి మరియ కుమార్ తదితరులు ప్రసంగించారు. అనంతరం అతిధులకు డాక్టర్ కల్లూరి ఆనంద్ రావు, డాక్టర్ నందిరాజు కళ్యాణి దంపతులు దుశ్శాలు వాలతో ఘనంగా సన్మాని ంచారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ కథా రచయిత ఉప్ప రపాటి వెంకటేశులు,జి రంగ నాయకులు, శ్రీకృష్ణదే వరాయ విశ్వవిద్యాల యం తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, డాక్టర్ కల్లూరి యశస్వి, డాక్టర్ అంకె శ్రీనివాసులు డాక్టర్ యోగేశ్వర నాయుడు, డాక్టర్ జూటూరి షరీఫ్, టీవీ రెడ్డి, చెట్ల ఈరన్న, టీవీ రెడ్డి, ప్రకాష్ బాబు, కల్లూరి ఆనందరావు కుటుంబ సభ్యులు డాక్టర్ నందిరాజు కళ్యాణి, డాక్టర్ కల్లూరి యశస్వి, వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు, కల్లూరి ఆనందరావు బంధు మిత్రులు ,స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

## ఖాతాదారులకు త్వరలో ఏటీఎం సేవలు అందుబాటులోకి తెస్తాం




మాట్లాడుతున్న చైర్మన్ జేఎల్ మురళీధర్

అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జె ఎల్ మురళీధర్అనంతపురం వైద్యం ఆగస్టు 3 ప్రభాతవాఖాతాదారులకు త్వరలో ఏటీఎం సేవలు అందుబాటులోకి తీసుక వచ్చి ఏటీఎం కార్డులను అందజేస్తామని అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్ అన్నారు. ఆదివారం స్థానిక సుభాష్ రోడ్ లో ఉన్న కృష్ణదేవ రాయభవన్ లో బ్యాంకు 109వ మహాజనసభ సమావేశం జరిగింది ఈ సమావేశానికి ఏడిసి సి బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవ రెడ్డి, బి సి ఎం ఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు జిల్లా సహకార అధికారి అరుణ కుమారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించిన అనంతరం చైర్మన్ మాట్లాడుతూ అర్బన్ బ్యాంక్ అనంతపురం ప్రజల ఆర్థిక పురోగతికి ఎంతగానో దోహదపడుతుందని పేద మధ్యతరగతి కుటుంబాలు బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవడానికి సామాన్యులకు అత్యంత చేరువుగా బ్యాంక్ కార్యకలాపాలు అందజేస్తున్నాయని పేద మధ్యతరగతి కుటుంబాల లో ఆర్థిక వెలుగులో నింపడానికి మా పాలకవర్గం సిబ్బంది ఎల్లవేళలా కృషి చేస్తున్నారని బ్యాంక్ ఎన్ పి ఏ 0 కలిగి ఉందని బ్యాంక్ యొక్క 2024 / 25 సంవత్సరానికి గాను బ్యాంక్ షేర్ హోల్డర్లకు డివిడెంట్‌ను 9.5 ప్రకటించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి నెఫ్ట్ , ఆర్టిజిఎస్ తోపాటు సదుపాయాలను అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ అర్బన్ బ్యాంక్ కొనసాగిస్తున్న బ్యాంకింగ్ కార్యకలాపాలు అభినందనీయమని జిల్లాలో అనేక జాతీయ బ్యాంకుల సైతం అర్బన్ బ్యాంక్ పోటీలు పడి అగ్రస్థానంలో కొనసాగుతోందని భవిష్యత్తులో కూడా అర్బన్ బ్యాంక్ సేవలో ఇలాగే ఉండాలని వారు కొనియాడారు. అనంతరం ఏడిసిసి బ్యాంక్ ఛైయ్మన్,డిసిఎంఎస్ ఛైర్మన్ లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి బ్యాంకు సీఈఓ ఎం విజయభాస్కర్, వైస్ చైర్మన్ లు వడ్డే సుబ్రహ్మణ్యం ఎం చంద్రశేఖర్, బ్యాంకు డైరెక్టర్లు సుంకర రమేష్, పి కృష్ణకుమార్, బి.రమణయ్య, గోల్డ్ భాష , రోళ్ళ భాస్కర్, జె .రామాంజనేయులు ,ఎల్ .అనిల్ నాయుడు బ్యాంక్ సిబ్బంది పెద్ద ఎత్తున ఖాతాదారులు పాల్గొన్నారు.

## రోగి మృతికి కారణమైన లావణ్య ఆసుపత్రి సీజ్



లావణ్యా ఆసుపత్రిని సీజ్ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 3 ప్రభాతవార్త

ఆపరేషన్ సమయంలో అధిక రక్తస్రావం షాక్ గురి కావడంతో బుక్కరాయ సముద్రం మండలం చదుల్ల గ్రామానికి చెందిన రాధిక అనే రోగి మృతికి కారణమైన అనంతపురం నగరంలోని రామ చంద్ర నగర్ లో ఉన్న లావణ్య ఆసుపత్రి ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. డాక్టర్ రమణా నాయక్ నిర్వహిస్తున్న లావణ్య ఆసుపత్రి లో రాధిక అనే రోగికి ఆపరేషన్ చేసే సమయంలో వైద్యుడు నిర్లక్ష్యం కారణంగా ఆమె మృతి చెందిందని ప్రాథమిక విచారణ రోగి బంధువుల ఆందోళన మధ్య ఆసుపత్రి సిజ్ చేసినట్లు ఇన్చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనుపమా జేమ్స్ తెలిపారు. అలాగే ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకొని తదుపరి చర్యలకు సిఫార్సు చేస్తామని ఆమె పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డెమో అధికారి త్యాగరాజు ఇతర వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నాగలగుడ్డంలో గడపగడపకు బాబుషూరిటీ మోసం గ్యారెంటీ



పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైఎస్ఆర్‌సిపి నేతలు

శింగనమల,

ఆగస్టు 3 ప్రభాతవార్త

మండల పరిధిలోని నాగలగుడ్డం, వెస్ట్ నర్సాపురం, గురుగుంట్ల, చిన్న జలాలపురం, నాగలగుడ్డం తాండా గ్రామాలలో ఆదివారం గడపగడపకు బాబుషూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సిపి నాయకులు గ్రామంలోని గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఆయా గ్రామాల్లో నియోజకవర్గ సమన్వయ కర్త శైలజానాథ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ మాజీ సమన్వయ కర్త ఎం.వీరాంజినేయులు, మాజీ డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ పూల ప్రసాద్, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర మహిళ బండి లలితా కళ్యాణి, వైఎస్ఆర్‌సిపి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు నాయక్, గురుమూర్తి రెడ్డి, తిరుపతయ్య, రామకృష్ణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగలగుడ్డం దాసరి వెంకటరమణ, శివమ్మ, వెంకటరమణ, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చిన్న జలాలపురంలో ఘనంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టిడిపి నేతలు

శింగనమల,

ఆగస్టు 3 ప్రభాతవార్త

మండల పరిధిలోనిచిన్న జలాలపురం గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే బం డారు శ్రావణిశ్రీ జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూత్ నాయకులు సుధాకర్, పూలకుంట పెద్దన్న, అట్టె ధనుంజయ, మొండిపోగుల ఎరిస్వామి, గోపాల్, అక్కులప్ప, నరసింహులు, పోతన్న, పెద్దన్న, నారాయణస్వామి, రాజు, ఆదినారాయణ, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సాయం

### - వైఎస్ఆర్‌సిపి నాయకులు దాసరి వెంకటరమణ



ఆర్థిక సాయం అందిస్తున్న దాసరి వెంకటరమణ

శింగనమల,

ఆగస్టు 3 ప్రభాతవార్త

మండల పరిధిలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన ఓబుళపతి గత నెల క్రితం ప్రమాదానికి గురై కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని ఆదివారం నాగలగుడ్డం గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి నాయకులు దాసరి వెంకటరమణ, ఓబుళపతిని పరామర్శించి అనంతరం ఆర్థిక సాయం అందించారు. మరింత మెరుగైన వైద్యం కోసం అండగా ఉంటానని వారి కుటుంబానికి భరోసా అందించారు. ఆయన వెంట గురుగు ంట్ల గ్రామస్తులు వరికూటి లక్ష్మన్న, శివ, ఉల్లికల్లు పవన్‌కుమార్, నాగల గుడ్డం లక్ష్మన్న, నాగభూషణం, నల్లప్ప, తిరుపాల్, ఏకె భూషణ తదితరులు పాల్గొన్నారు.